‘మిర్యాల’లో డిజిటల్ సర్వే..!

- సాగు భూముల నక్ష మాదిరిగానే 'పట్టణ నక్ష'
- ఇప్పటికే హెలికాప్టర్ ద్వారా ఏరియల్ సర్వే పూర్తి
- డిజిటల్ సర్వేకు 14 బృందాల ఏర్పాటు


మిర్యాలగూడ మున్సిపాలిటీ ముఖచిత్రం

మిర్యాలగూడ టౌన్: అన్నిరకాల మౌలిక వసతులు కల్పిస్తూ పట్టణాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీంట్లో భాగంగా ‘నేషనల్ జియో స్పేషియల్ నాలెడ్జ్ బెస్ట్ ల్యాండ్ సర్వే ఆఫ్ అర్బన్ హ్యాబిటేషన్‌’(నక్ష) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డిజిటల్ ఇండియా ల్యాండ్ రికార్డ్స్ మోడ్రనైజేషన్ ప్రోగ్రాంలో భాగంగా ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మిర్యాలగూడ మున్సిపాలిటీని నక్షకు ఎంపిక చేసింది. దీంట్లో భాగంగా ముందుగా శుక్ర, శనివారాల్లో హెలికాప్టర్ ద్వారా హై టెక్నాలజీ కెమెరాలతో ఏరియల్ భూ సర్వే పూర్తిచేశారు. మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ల్యాండ్ రీసోర్సెస్ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్వీ అసోసియేట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో వివిధ శాఖలకు చెందిన అధికారులతో 14 బృందాలుగా ఏర్పడి త్వరలోనే డిజిటల్ సర్వేను చేపట్టనుంది.

మిర్యాలగూడ మున్సిపాలిటీ వివరాలు..	
మొత్తం వార్డులు	48
గృహాలు	26,108
జనాభా(2011)	1,09,891
ప్రస్తుత జనాభా	1,48,632
ఏరియల్ సర్వే	28.36 చ.కిమీ
ఫీల్డ్ సర్వే	28.36 చ.కిమీ
సర్వే బృందాలు	14

సాగు భూమి నక్ష మాదిరిగానే..

సాగు భూములకు నక్ష ఏవిధంగా ఉంటుందో.. అంతే క్లియర్‌గా మున్సిపాలిటీకి సంబంధించిన అన్నీ వివరాలు తెలిసే విధంగా నక్ష తయారు చేయనున్నారు. ఇందులో భాగంగానే సర్వే బృందం మున్సిపాలిటీలోని ప్రభుత్వ స్థలాల గుర్తింపు, నివాసాల సంఖ్య, మురికివాడలు, చెరువులు, కాలువలతో పాటు నాలాలు, డంపింగ్ యార్డుల విస్తీర్ణం, హద్దులతో పాటు ఆక్రమణలను గుర్తించనున్నారు. అయితే సర్వే బృందం హెలికాప్టర్ ద్వారా డ్రోన్ కెమరాలు అయినా ఆర్థోరెక్టిఫైడ్ ఇమేజ్(ఓఆర్ఐ), డిజిటల్ ఎలివేషన్ మోడల్ (డీఈఎం) 2డీ, 3డీ, 4డీ సడీర్ ప్లస్ కెమరాలతో పాటు మరో ఐదు ఒబ్లీక్ యాంగిల్ సెన్సార్ కెమరాలను వినియోగించారు. వీటి ద్వారా శుక్ర, శనివారాల్లో ఫిజికల్ ఫొటోలు, వీడియోలను చిత్రీకరించారు. శాటిలైట్‌తో అనుసంధానిస్తూ అక్షాంశాలు, రేఖాంశాల రూపంలో సాంకేతిక టెక్నాలజీని ఉపయోగిస్తూ రెవెన్యూ, మున్సిపల్, సర్వే ల్యాండ్ శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి ఆస్తుల వివరాలను పక్కాగా నమోదు చేయనున్నారు.

మారనున్న రూపురేఖలు

ప్రస్తుతం మున్సిపాలిటీలో రోవర్లు, డిఫరెన్షియల్ గ్లోబల్ ప్రొఫెషనల్ సిస్టం (డీజీపీఎస్) తదితర ఆధునీకరణ పరికరాలతో రీ సర్వే ఫలితాల్లో వ్యత్యాసం మిల్లీమీటర్లకే పరిమితం కాగా భూ సర్వే రూపురేఖలు మారిపోనున్నాయి. మున్సిపాలిటీలో ఏరియల్ సర్వే చేసిన అనంతరం ఈ ఫొటోలన్నింటిని కోర్స్ స్టేషన్, రోవర్ల సహాయంతో వచ్చిన ఫీల్డ్ సర్వే కొలతలతో పోలుస్తారు. నిర్దేశించిన స్థలాల హద్దులు, కొలతల మేరకు రేఖాంశాలు కోఆర్డినేటర్లతో రూపొందుకున్న సర్వే మ్యాప్‌లను సర్వే ఆఫ్ ఇండియా రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. అదేవిధంగా మున్సిపాలిటీలో డిజిటలైజ్ సర్వే కోసం 49 కంట్రోల్ పాయింట్లను గుర్తించారు. శాటిలైట్ అనుసంధానం కలిగిన డీజీపీఎస్ ద్వారా వీటిని ఎంపిక చేశారు. అమృత్ 2.0 పథకంతో పాటు నక్ష పథకంలో మిర్యాలగూడ మున్సిపాలిటీ ఎంపిక కావడంతో ఆస్తుల వివరాలు మాత్రం పక్కగా తేలనున్నాయి.

భూముల లెక్క పక్కాగా ఉంటుంది



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన పైలట్ ప్రాజెక్టు నక్షలో భాగంగా ఏరియల్ సర్వే ద్వారా గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లు గుర్తించాం. శుక్ర, శనివారాల్లో పట్టణంలో ఏరియల్ సర్వే పూర్తయింది. ఈ సర్వేలో భూములు లెక్క పక్కాగా ఉండనున్నది.

– శ్రీనివాసులు, ఏడీ భూముల సర్వే విభాగం, నల్లగొండ

మొక్కలు నాటి వాటిని సంరక్షించాలి

- రమావత్ రవీంద్రకుమార్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న రమావత్ రవీంద్రకుమార్

దేవరకొండ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం కేసీఆర్ పుట్టినరోజును పురస్కరించుకొని ఈ నెల 17న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ రూపకర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపుమేరకు మొక్కలు నాటనున్నట్లు తెలిపారు. తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పరితపించే నాయకుడు కేసీఆర్ పుట్టినరోజు నేపథ్యంలో దేశ వ్యాప్తంగా వృక్షార్చన కార్యక్రమం చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన నాటి నుంచి హరిత విప్లవానికి శ్రీకారం చుట్టిన మాజీ ఎంపీ సంతోష్‌కుమార్ కృషి వెలకట్టలేనిదన్నారు. అనంతరం వృక్షార్చనకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వేముల రాజు, బొడ్డుపల్లి కృష్ణ, మధు, మాకం చంద్రమౌళి, బాబా, అఫ్రోజ్, జమీర్, తదితరులున్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్యశిబిరంలో మందులు పంపిణీ చేస్తున్న జేవీవీ ప్రతినిధులు

మిర్యాలగూడ టౌన్ : ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ న్యూరో ఫిజిషియన్ డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని హౌజింగ్‌బోర్డులో గల నవజ్యోతి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో మూర్ఛ, పక్షవాతంపై నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో 260మంది రోగులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం దాత పాదూరి రామ్‌సునీల్‌రెడ్డి, ఏచూరి మురహరి భాగ్యలక్ష్మి, సాధినేని శ్రీనివాస్ రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపాలం శ్రీమన్నారాయణ మాట్లాడారు. సమాజంలో ప్రతిఒక్కరూ శారీరక శ్రమ చేస్తూ ఆహార అలవాట్లను మార్చుకొని రోగం వచ్చినప్పుడు వైద్యుల సలహాల మేరకు మందులను వాడాలన్నారు. తిరిగి జూన్ 15న వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు పాదూరి రమణారెడ్డి, సత్యనారాయణరావు, కోమలి, శోభారాణి, మహిత, నసిమా, పావని, గౌతం, శ్రీనాథ్, రంగా, కృష్ణమూర్తి, కృష్ణారావు తదితరులున్నారు.

ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని శ్రీభక్తాంజనేయస్వామి వారి 23వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం విశ్వక్సేన ఆరాధాన, అంకుర్పాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఆలయ ప్రధాన అర్చకుడు గోవర్ధన శ్రీచరణాచార్యులు ప్రసాద్, యాగ్నికులు గోవర్ధన శ్రీరామాచార్యులు వేదమంత్రోత్సాల మధ్య ఘనంగా ప్రారంభించారు. మహోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

క్లుప్తంగా

ఆలయంలో అష్టోత్తర కలశ పూజలు


శ్రీకనకదుర్గ ఆలయంలో కలశ పూజలు

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని గాంధీనగర్‌లో గల శ్రీలక్ష్మీ సరస్వతి సహిత శ్రీకనకదుర్గ ఆలయంలో పంచ వింశత్ 25వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం అష్టోత్తర కలశ పూజలు, దీక్షాధారణ పంచగవ్య ప్రసాన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గణపతిపూజ, పుణ్యావచనం, కలశ పూజలు, మంటప ఆరాధనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు శంభుప్రసాద్, పూర్ణయ్య, లక్ష్మీనారాయణ వేదమంత్రోత్సవాల మధ్య పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్లు తిరునగరు భార్గవ్, తిరునగరు నాగలక్ష్మి, సభ్యులు నాగేశ్వర్‌రావు, రమేష్, అల్లాని రమేష్, జయశంకర్, రాంశేఖర్, రేపాల రమేష్, సుధాకర్ తదితరులున్నారు.

సభను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేష్

దేవరకొండ : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పట్టణంలో ఈ నెల 19న నిర్వహించనున్న భారీ శోభాయాత్ర, బహిరంగ సభను విజయవంతం చేయాలని శివాజీ యువదళ్ పట్టణ అధ్యక్షుడు నేతాళ్ల వెంకటేష్, వ్యవస్థాపకుడు హరికృష్ణ కోరారు. ఆదివారం పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించి వారు మాట్లాడారు. ప్రతి ఏటా ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శివాజీ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నిమ్మల గణేష్, దుర్యోధన్ పాటిల్, అనిల్, అంజి, శివ, యశ్వంత్, అజయ్, తదితరులున్నారు.

వేద గణిత గ్లోబల్ పోటీ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ

హాలియా : అబాకస్, వేద గణిత గ్లోబర్ లెవల్ పోటీ పరీక్షలో స్థానిక కృష్ణవేణి స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చి అవార్డు అందుకున్నట్లు ఆ పాఠశాల డైరెక్టర్ నిమ్మల లక్ష్మారెడ్డి ఆదివారం తెలిపారు. జనవరి 3వ తేదీన స్మార్ట్ జూనియర్ ఆధ్వర్యంలో నిర్వహించిన అబాకస్ వేద గణిత గ్లోబల్ లెవల్ పోటీ పరీక్షల్లో తమ పాఠశాలకు చెందిన 28 మంది విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి సాధించినార్రన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో ఆదివారం అవార్డుల ప్రదానోత్సవం జరిగిందని తెలిపారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా తమ పాఠశాల విద్యార్థులు అవార్డు అందుకున్నట్లు పేర్కొన్నారు. అబాకస్, వేద గణిత గ్లోబల్ పోటీ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి బహుమతి సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం అభినందించారు.

పాఠశాలలో పోలీసుల విచారణ

దేవరకొండ : మండలంలోని పెంచికల్‌పహాడ్ గిరిజన బాలికల గురుకుల హాస్టల్‌లో ఓ ఆకతాయి చొరబడి విద్యార్థినులను భయాందోళనకు గురిచేశాడని సామాజిక మాధ్యమాల్లో వార్తలు రావడంతో ఆదివారం మండల పోలీసులు విచారణ చేపట్టారు. శుక్రవారం రాత్రి పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అదే రోజు తెల్లవారుజామున గుర్తుతెలియని ఓ ఆకతాయి హాస్టల్‌లోకి చొరబడి విద్యార్థినులను భయాందోళనకు గురిచేశాడు. దీంతో నిద్రలో నుంచి మేల్కొన్న విద్యార్థినులు కేకలు వేయడంతో పారిపోయాడని సమాచారం. ఈ ఘటనపై ఎస్పీ ఆదేశాల మేరకు దేవరకొండ పోలీసులు పాఠశాల సీసీ ఫుటేజీని పరిశీలించగా దేవరకొండ మహిళా ఎస్ఐ సాలకమ్మ ఆదివారం పాఠశాలకు చేరుకొని వివరాలు సేకరించినట్లు సీఐ నర్సింహులు తెలిపారు.

ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌యాదవ్


నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

మిర్యాలగూడ : పట్టణంలో ప్రింటర్స్ అండ్ డీటీపీ అసోసియేషన్ పట్టణ కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎన్నికల అధికారులు చంద్రమౌళి, ఉపేందర్, విజయ్ సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘం పట్టణ నూతన అధ్యక్షుడిగా కట్టబోయిన శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శిగా విశ్వనాథం, కోశాధికారిగా ఈశ్వర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తుప్పతి యాదగిరి, దొంగరి రాజు, సోమలింగం శ్రీనివాస్, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు నిరసనగా ధర్నా


సమావేశంలో మాట్లాడుతున్న డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు నిరసనగా ఈ నెల 18, 19తేదీల్లో ఆయా మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బీరేపల్లి వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్నారు. అన్నిరంగాల్లో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. ఈ నెల 18న మండల కేంద్రాలలో, 19న నియోజకవర్గ కేంద్రాలలో ధర్నాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నూకల జగదీశ్చంద్ర, మల్లు గౌతంరెడ్డి, పాదూరి శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, రెమిడాల పరుశురాములు, రొండి శ్రీనివాస్, అయూబ్, తిరుపతి, రామ్మూర్తి, దయానంద్, కరీమున్నీసా, కోడిరెక్క మల్లయ్య, పల్లా భిక్షం, గోవర్ధన, లక్ష్మీనారాయణ, వెంకట్‌రెడ్డి, సైదానాయక్, రామారావు పాల్గొన్నారు.

జీవితాలతో చెలగాటం ఆడుతున్న కాంగ్రెస్



మాట్లాడుతున్న కుర్ర సైదానాయక్

మిర్యాలగూడ టౌన్ : పేద, మధ్య తరగతి విద్యార్థుల జీవితాలతో నాడు బీఆర్ఎస్ ప్రభుత్వం, నేడు కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదానాయక్ ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటి నుంచి నేటి వరకు పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో అనేక మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంటు రాక కళాశాలల యాజమాన్యం సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని, వారు ఉన్నత విద్యకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 19, 20తేదీల్లో నల్లగొండలో సంఘం జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు, ఈ మహాసభను విజయవంతం చేసేందుకు విద్యార్థులు తరలిరావాలన్నారు. అనంతరం 11 మందితో మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సభలో సంఘం డివిజన్ అధ్యక్షుడు జగన్‌నాయక్, నాయకులు జగన్, మునీ, తరుణ్‌కుమార్, ఈశ్వర్, కల్యాణ్ తదితరులున్నారు.

దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలి


మాట్లాడుతున్న జాజుల లింగంగౌడ్

మిర్యాలగూడ టౌన్ : దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు నిజంగా బీసీలపై ప్రేమ ఉంటే బీసీలకు విద్య, ఉద్యోగ, ఉపాధిలతో పాటు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కులగణనను ఈసారి సమగ్రంగా చేపట్టాలన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో సర్వే చేస్తే బీసీల జనాభా మరింత పెరుగుతుందన్నారు. సమావేశంలో సంఘం నాయకులు బంటు వెంకటేశ్వర్లు, శేఖర్, నక్క నాగరాజు పాల్గొన్నారు.

ఆగని ఎన్ఎస్పీ భూముల ఆక్రమణలు


నాగార్జునసాగర్ ఎన్ఎస్పీ భూమిలో బోరు వేస్తున్న ఆక్రమణదారులు

నాగార్జునసాగర్ : నందికొండ మున్సిపాలిటీ పరిధి నాల్గవ వార్డులోని ఎన్ఎస్పీకి సంబంధించిన ఖాళీ స్థలాన్ని దర్జాగా కబ్జాచేసి అమ్ముకుంటున్న ఆక్రమణదారులు. గతంలో స్థలాన్ని నాల్గవ వార్డుకు సంబంధించి పార్కుగా చేస్తామని అప్పటి ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. ఆ తరువాత కొందరు వ్యక్తులు ఆ స్థలాన్ని యధేచ్ఛగా ఆక్రమించుకొని ఇతరులకు అమ్ముకుంటున్నారు. ఆదివారం ఆ స్థలంలో బోర్ వేయడానికి ఆక్రమణదారులు ప్రయత్నించడంతో సంబంధిత అధికారులు పర్మిషన్ లేదని ఆపివేశారు. ఇప్పటికైనా ఎన్ఎస్పీ అధికారులు స్పందించి స్థలాన్ని ఆక్రమణకు గురికాకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రోడ్డు వెంట ప్రమాదకరంగా..



కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

డిండి: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ చౌరస్తా నుంచి దేవరకొండ వెళ్లే రోడ్డు వెంట ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఎలాంటి కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. దీంతో జనసంచారం ఎక్కువగా ఉన్న ఈ ప్రదేశంలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి రోడ్ల వెంట ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ రక్షణ కంచె ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

19 నుంచి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు


హాలియాలో ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అంజనేయస్వామి భక్తులు

హాలియా : పట్టణంలో నూతనంగా పునర్నిర్మించిన శ్రీ స్వయంభూ భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు జీర్ణోద్ధారణ సహిత ఆంజనేయ స్వామి విగ్రహ పునఃప్రాణప్రతిష్ఠ, అష్టబంధన మహాకుంభాభిషేకం మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆంజనేయ స్వామి కమిటీ సభ్యులు ఆదివారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. బ్రహ్మశ్రీ నందివెలుగు బాలాజీ గురుకుల్ ఆధ్వర్యంలో ఈనెల 19న విఘ్నేశ్వర పూజ, హనుమత్ వ్రతం, 20న జలాధివాసం, 21న క్షీరాధివాసం, పంచగవ్యాధివాసం, ధాన్యాధివాసం, పంచశయ్యాధివాసం, రాత్రి జల్దా విశ్వనాథ జయరాములుతో హరికథ, గానం, 22న చందనాధివాసము, ద్వారకామయి భజన సమాజ్‌తో హనుమాన్ చాలీసా, రాత్రి భక్తాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, 23న మహా పూర్ణాహుతి, మహా కుంభాభిషేకం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గుడి నిర్మాణానికి పట్టణంలోని సాయి బృందావన్ కాలనీకి చెందిన దాతలు రూ. 3లక్షలను విరాళంగా అందించినట్లు వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మోహన్‌రావు, కాకునూరి నారాయణ గౌడ్, ప్రముఖ పారిశ్రామికవేత్త చిట్టిపోలు యాదగిరి, చెన్ను వెంకటనారాయణ రెడ్డి, గౌనీ రాజా రమేష్ యాదవ్, పేలపూడి బాలకృష్ణ, వీరమల్ల కృష్ణయ్య, సముద్రాల దామోదర్, సముద్రాల శ్రీనివాస్, వీరమల్ల శ్రీనివాస్, వర్కాల సుధాకర్‌రెడ్డి, నులక వెంకట్‌రెడ్డి, వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


ప్రతిష్ఠాపన విగ్రహాలకు పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


పూజలో పాల్గొన్న మంత్రి కోమటిరెడ్డి

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని 10వ వార్డు నీలగిరి కాలనీలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వచ్చే భక్తులకు అన్నదానం చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, నల్లగొండ మాజీ జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, తిప్పర్తి మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, కనగల్ మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, 10వ వార్డు మాజీ కౌన్సిలర్ ప్రదీప్‌నాయక్, 9వ వార్డు మాజీ కౌన్సిలర్ చిన్నాల అలివేలు జానయ్య తదితరులు పాల్గొన్నారు.


శ్రీ లక్ష్మీనరసింహస్వామి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు హాజరైన భక్తులు

ఇంధనం పొదుపుగా వాడాలి

నల్లగొండ టౌన్ : పర్యావరణాన్ని కాపాడుకుంటూ ఇంధనం పొదుపుగా వాడాలని ఇండియన్ ఆయిల్ కంపెనీ లిమిటెడ్ (ఐఓసీఎల్) జిల్లా సేల్స్ ఆఫీసర్ బి.దిలీప్‌నాయక్ అన్నారు. ఆదివారం కేంద్ర మినిస్ట్రీస్ ఆఫ్ పెట్రోలియం సహజ వనరుల ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలోని రామగిరి ఇండేన్ గ్యాస్ కార్యాలయం నుంచి గడియారం సెంటర్ మీదుగా సాక్ష్యం-2024-25 వాక్ దాన్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు సురక్షితమైన పర్యావరణం, స్థిరమైన ఇంధనం సమకూర్చే నిర్దేశాలను చేయాలన్నారు. కార్యక్రమంలో ఇండేన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు, సిబ్బంది, డెలివరీ బాయ్స్ పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న ఇండేన్ గ్యాస్ సిబ్బంది

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థి కృష్ణుడును అభినందిస్తున్న ప్రిన్సిపల్ స్వప్నారెడ్డి

నకిరేకల్ : పట్టణంలోని ఏవీఎం ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి జటావత్ కృష్ణుడు జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యాడని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, పీడీలు నిమ్మల శంకర్‌గౌడ్, ఉపేందర్ ఆదివారం తెలిపారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 17 నుంచి 20 వరకు జరగబోయే జాతీయస్థాయి అంతర్ జిల్లా జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీల్లో కృష్ణుడు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థి కృష్ణుడును ఏవీఎం విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, అడ్మినిస్ట్రేటర్ కందాల శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లయ్య అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివ స్వరూపరాణి తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని పాఠశాలలో సంప్రదించాలన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలి సంఘం(ఏఐకేఎంఎస్)జిల్లా అధ్యక్షుడు జ్వాల వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని ఈదులూరు గ్రామంలో సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ కమిటీ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

డీఐఈవోకు వినతి

నల్లగొండ: ఇంటర్‌మీడియట్ వార్షిక పరీక్షలకు సంబంధించి విధులు ఇంటర్‌మీడియట్ బోర్డు కమిషనరేట్ నుంచి విడుదలైన జాబితా ప్రకారం కేటాయించాలని కోరుతూ ఆదివారం డీఐఈవో దస్రునాయక్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ 475 తరపున వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు లెక్చరర్లు పాల్గొన్నారు.